క్లుప్తంగా

డిజిటల్ అసిస్టెంట్‌కు అభినందన

దొరవారిసత్రం: ఏపీ సేవ, సర్వీసెస్ సేవలు అత్యధిక అందించి, తిరుపతి జిల్లాలోనే ప్రథమ స్థానం సాధించిన కల్లూరు సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ ఎం మునిశేఖర్‌ను మంగళవారం వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి అభినందించారు. వచ్చే వారం నిర్వహించే వీడియో కాన్ఫరెన్స్‌కు కల్లూరు డిజిటల్ అసిస్టెంట్‌ను తీసుకురావాలని తనకు సూచించినట్లు ఎంపీడీఓ సింగయ్య తెలిపారు.

కండలేరులో 51.564 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం నాటికి 51.564 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయి గంగ కాలువకు 1460 క్యూసెక్కులు, పిన్నేరు వాగుకు 50, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 60, లోలెవల్ స్లూయీస్‌కు 30, హైలెవల్ స్లూయీస్‌కు 50 క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నట్లు చెప్పారు.

పేద మహిళలకు చీరల పంపిణీ



చీరలు, భోజనం ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న దాత

గూడూరు: ప్రగతిసేవాసంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఆర్ముగం వర్ధంతిని పురస్కరించుకుని, ఆయన కుమారుడు రమేష్ దాతృత్వంతో పేద మహిళలకు చీరలు పంపిణీ చేసి, అన్నదానం చేశారు. పేదలను ఆదుకునేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో అభినందనీయమని సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జీ చంద్రశేఖర్, కే శ్రీనివాసులు, పీ మల్లికార్జునరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, రామ్మోహన్ రావు, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

పేదలకు బియ్యం బస్తాల అందజేత



బియ్యం అందిస్తున్న సంస్థ నిర్వాహకుడు

దొరవారిసత్రం: నెలబల్లి గ్రామంలోని ఎస్టీ కాలనీకి చెందిన పలు పేద కుటుంబాలకు మంగళవారం తడ కండ్రిగకు చెందిన శ్రీకృష్ణా ఫౌండేషన్ ఆధ్వర్యంలో బియ్యం బస్తాలు అందజేశారు. శ్రీకాళహస్తి పట్టణ ప్రాంతానికి చెందిన రమేష్‌కుమార్ సహకారంతో బియ్యం పంపిణీ కార్యక్రమం చేపట్టినట్లు సంస్థ నిర్వాహకుడు నెల్లూరు నాగరాజు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

కోట: స్థానిక కోటమ్మగుడి కాలనీలో నివాసం ఉంటున్న రాజశేఖర్ మంగళవారం గన్నేరుకాయలు తిని, ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ కలహాల నేపథ్యంలోనే ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు సమాచారం. కుటుంబ సభ్యులు 108 సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో కోట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

పూరింటికి నిప్పు..



కాలిపోయిన పూరిల్లు

పెళ్లకూరు: మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన రాయి సుబ్బమ్మ పూరింటికి సోమవారం రాత్రి గుర్తు తెలియని ఆకతాయిలు నిప్పు టించడంతో ఇంటితోపాటు అందులోని వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. బాధితురాలి కథనం మేరకు.. గ్రామానికి చెందిన సుబ్బమ్మ అనే వృద్ధురాలు ఇంట్లో ఒంటరిగా నిద్రిస్తోంది. పండుగ పూట గుర్తు తెలియని ఆకతాయిలు పూరింటికి నిప్పు పెట్టడంతో మంటలు చెలరేగాయి. మంటల తాకిడిని గుర్తించిన వృద్ధురాలు కేకలు వేస్తూ వీధిలోకి వచ్చింది. దీంతో స్థానికులు ఆ మంటలను ఆర్పి వేశారు. అప్పటికే ఇంట్లోని దుస్తులు, కొంత నగదు, పలు రకాల వస్తువులు కాలిపోయాయి. ఈ ఘటనలో సుమారు రూ.50 వేలకు పైగా నష్టం వాటిల్లిందని బాధితురాలు వాపోయింది.

వేడుకగా వనమహోత్సవం



నందనవనంలో అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకులు

రాపూరు: పెంచలకోనలోని ఆదిలక్ష్మీదేవి అమ్మవారికి మంగళవారం రాత్రి శ్రీవారి నందనవనంలో వనమహోత్సవం కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఆదిలక్ష్మీదేవి ఉత్సవమూర్తిని పద్మపీఠంపై కొలువుదీర్చి సుగంధభరిత పుష్పాలు, ఆభరణాలతో విశేషాలంకరణ చేసి, మేళతాళాలు, వేద మంత్రోచ్చారణల నడుమ నందనవనం(తోట)లోకి వేంచేపు చేసి, అక్కడ ఉన్న మండపంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, ఆస్థాన సేవ నిర్వహించారు. అమ్మవారి ఉత్సవాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కాగా మకర సంక్రాంతి తరువాత వచ్చే ముక్కనుమ రోజున ఆదిలక్ష్మీదేవికి వనమహోత్సవం నిర్వహించడం ఈ క్షేత్రం ఆచారమని దేవస్థానం ప్రధానార్చకులు పెంచలయ్యస్వామి తెలిపారు.

చిరస్థాయిగా నిలిచేలా సంక్షేమ పథకాలు



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందించి సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సంజీవయ్య



ఎమ్మెల్యే సంజీవయ్య, నాయకులకు గజమాల వేసి స్వాగతిస్తున్న స్థానికులు

- ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

నాయుడుపేటటౌన్: పలు వినూత్న పథకాలు అమలు చేస్తూ దేశచరిత్రలో ఆంధ్రప్రదేశ్ పేరు చిరస్థాయిగా నిలిచిపోయేలా సీఎం జగన్‌మోహన్ రెడ్డి పనిచేస్తున్నారని సూళ్లూరుపేట ఎమ్మెల్యే, టీటీడీ పాలక మండలి సభ్యుడు కిలివేటి సంజీవయ్య అన్నారు. నాయుడుపేట భూపయ్య కాలనీ సచివాలయం పరిధిలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చైర్‌పర్సన్ కటకం దీపిక, వైస్ చైర్మన్ జలదంకి వెంకట కృష్ణారెడ్డి సారథ్యంలో నిర్వహించారు. ముందుగా చైర్‌పర్సన్ తయారు చేయించిన గడప గడపకు సంజీవయ్య పేరుతో ఉన్న టీ షర్టులను ఎమ్మెల్యే చే తుల మీదుగా ఆవిష్కరించారు. అనంతరం సచివాలయ పరిధిలోని అగ్రహారపేట, ఎల్‌ఏ సాగరం గిరిజన కాలనీ, అమరా గార్డెన్, మోహన్‌బాబుతోట తదితర ప్రాంతాల్లో ఎమ్మెల్యే ఇంటింటింటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాయా? లేదా, ఇళ్ల స్థలాలు మంజూరయ్యాయని అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులు పొందిన పథకాల వివరాలతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేస్తూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మీ చల్లని దీవెనలు అందించాలని కోరారు. వార్డు పరిధిలో అనేక మంది వివిధ సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించడంతో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, విద్యుత్ శాఖ డీఈ ఆర్ శేఖర్, వివిధ శాఖల అధికారులతో మాట్లాడి వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి గడపలో ఎమ్మెల్యేతోపాటు నాయకులకు అపూర్వ ఆదరణ లభించింది. పలు కూడళ్ల వద్ద ఎమ్మెల్యేతో పాటు నాయకులకు శాలువలు కప్పి ఘనంగా సత్కరించి, స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తంబిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి, ఎంపీపీ ధనలక్ష్మి, బైనా మల్లికార్జునరెడ్డి, కటకం జయరామయ్య, కలికి మాధవరెడ్డి, జీ సిద్దయ్య, కిషోర్ యాదవ్, కేసీ కుమార్, మెస్ భాస్కర్‌రెడ్డి, ఎస్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, చంద్రారెడ్డి, ఎం లక్ష్మీనారాయణ, పీ హరిరెడ్డి, దారా రవి, రాహుల్, ఏ బాబు, వెంకటేశ్వర్లు, రహమతుల్లా, కౌన్సిలర్లు కే ఆశోక్ కుమార్, బంగారు బాబు, నారాయణరెడ్డి, ఆర్ సరిత, పీ నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

వరి సాగులో నీటి యాజమాన్యం కీలకం



రైతులకు సూచనలు చేస్తున్న ఏఓ హైమావతి

సైదాపురం: వరిసాగులో నీటి యాజమాన్యం కీలకమని ఏఓ హైమావతి పేర్కొన్నారు. మండలంలోని ఊటుకూరు, గంగదేవిపల్లె, తురిమెర్ల తదితర గ్రామాల్లో మంగళవారం వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ వరి నాట్లలో నీరు పలుచగా ఉండేలా చూసుకోవాలన్నారు. నాట్లు మొదలుకుని వరి దుబ్బు చేసే వరకు కేవలం 2 నుంచి 3 సెంటీమీటర్ల నీరు మాత్రమే ఉండాలని సూచించారు. నీరు ఎక్కువగా పెడితే పైరు దుబ్బు చేయదన్నారు. పంట చిరు పొట్ట దశకు చేరినప్పటి నుంచి గింజ బాగా గట్టి పడే దశ వరకు 5 సెంటీమీటర్ల మేర నీరు విధిగా ఉంచాలని సూచించారు. వరినాట్ల సమయంలో తగ్గు చర్యలు తీసుకోవాలన్నారు. భూసార ఫలితాలను ఆధారంగా ఆయా గ్రామాల రైతులు తమ పొలాల్లో ఎరువులను వాడుకోవాలని చెప్పారు. వ్యవసాయాధికారులు సూచనలు తప్పని సరిగా పాటించాలన్నారు.

అందరికీ అందుబాటులో పార్టీ కార్యాలయం



నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని సత్కరిస్తున్న సచివాలయ కన్వీనర్లు

- వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి

వెంకటగిరి: నియోజకవర్గ ప్రజలతోపాటు వైఎస్సార్ సీపీ శ్రేణులకు అందుబాటులో ఉండడానికే నూతన పార్టీ కార్యాలయం ఏర్పాటు చేస్తున్నట్లు వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. స్థానిక నేదురుమల్లి నివాసంలో మంగళవారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బుధవారం ఉదయం 9.45 గంటలకు పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయ నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమం నిర్వహిస్తామని, ప్రతి ఒక్కరూ హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. నియోజకవర్గంలో నిర్వహించబోయే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంతోపాటు పార్టీ కేంద్ర కార్యాలయం సూచించే కార్యక్రమాల నిర్వహణ పక్కాగా జరిగేలా స్థానిక కార్యాలయం నుంచి పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. కార్యాలయ సిబ్బంది ఎప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు.

నేదురుమల్లికి సన్మానం

నియోజకవర్గంలోని సచివాలయ కన్వీనర్లు పలువురు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి, సత్కరించారు. ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో వివరించి పార్టీ ప్రతిష్టను పెంచడానికి కృషి చేయాలని సూచించారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి జిల్లాలోనే అత్యధిక మెజారిటీ వెంకటగిరి నియోజకవర్గంలో సాధించేలా సచివాలయ కన్వీనర్లు శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు చెలికం శంకరరెడ్డి, నెమళ్లపూడి సురేష్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు పి దశరథరామిరెడ్డి, వీ కార్తీక్‌రెడ్డి, నక్రావుల వేణునాయుడు, జీ అరుణాచలం, నాగయ్య, కౌన్సిలర్లు వహీదా యస్థానీ, కె కృష్ణమూర్తి, ఏ శ్రీనివాసులురెడ్డి, నాయకులు తోట గణేష్‌రెడ్డి, బండి రమేష్‌రెడ్డి, ఎం నరసింహులు, సి శ్రీనివాసులురెడ్డి, కోటి, గోపాల్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కండలేరు సందర్శన



జలాశయం వద్ద మహేంద్ర ప్రతాప్ సింగ్

రాపూరు: కండలేరు జలాశయాన్ని మంగళవారం కృష్ణ రివర్ డెవలప్‌మెంట్ బోర్డు చైర్మన్ మహేంద్ర ప్రతాప్‌సింగ్, ఈఈ శివశంకరయ్య సందర్శించారు. జలాశయం అంతర్భాగమైన హెడ్ రెగ్యులేటర్, స్పిల్‌వేలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులతో మాట్లాడుతూ కండలేరు జలాశయం నుంచి చెన్నైకి సరఫరా చేస్తున్న నీటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎస్ఈ హరినారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం కండలేరు జలాశయంలో 51.564 టీఎంసీల నీరు నిల్వ ఉందని, చెన్నై అధికారులు అడిగిన వెంటనే నీరు విడుదల చేస్తామని చెప్పారు. వారి వెంట సోమశిల జలాశయం ఎస్ఈ రమణారెడ్డి, కండలేరు, సోమశిల ఈఈలు విజయకుమార్‌రెడ్డి, దశరథరామిరెడ్డి, డీఈలు మునివేణు, సుబ్రమణ్యం, బాబయ్య, ఏఈలు తిరుమలయ్య ఉన్నారు.

భక్తులకు అన్నదానం

పెళ్లకూరు: మండలంలోని తాళ్వాయిపాడులో వీర్లయ్యస్వామి ఉత్సవాలు సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం చేశారు. స్వామివారి ఉత్సవాల్లో భాగంగా ఉత్సవమూర్తిని గ్రామంలో ఊరేగించారు. స్వామివారికి ధూపదీప నైవేద్యాలు సమర్పించి, భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

నృత్యప్రదర్శనను విజయవంతం చేయాలి

గూడూరు: అంబేద్కర్ జీవితచరిత్ర, సంఘం శరణం గచ్ఛామి అన్న అంశాలపై నిర్వహించనున్న నృత్య ప్రదర్శనను దళిత సంఘాలు, అంబేడ్కర్ అభిమానులు తిలకించి, విజయవంతం చేయాలని కేవీపీఎస్ పట్టణ కార్యదర్శి ఏ ప్రసాద్ పిలుపునిచ్చారు. పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో ఈ మేరకు మంగళవారం సంఘం శరణం గచ్ఛామి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో 20వ తేదీ శుక్రవారం సాయంత్రం 5 గంటలకు హైదరాబాద్‌కు చెందిన అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ వారి ఆధ్వర్యంలో సంఘం శరణం గచ్ఛామి అన్న అంశంపై నృత్య ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కే ముత్యాలయ్య, శ్రీనివాసులు, జీ రమేష్, శివకుమార్, పీ మణి, బీ గోపి, బీవీ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌పీసీ చైర్‌పర్సన్‌తో అట్రాసిటీ కమిటీ సభ్యుడి భేటీ



దేవసేనమ్మను సత్కరిస్తున్న వెంకటరమణయ్య

గూడూరు: స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్(ఎస్‌పీసీ) రాష్ట్ర చైర్ పర్సన్ పానకా దేవసేనమ్మను, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ జిల్లా కమిటీ సభ్యుడు నన్నూరు వెంకటరమణయ్య తదితరులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పట్టణంలోని కరణాల వీధిలో ఉన్న ఆమె నివాసంలో, ఎస్సీఎస్టీ అట్రాసిటీ జిల్లా కమిటీ సభ్యుడు వెంకటరమణయ్య ఆమెను కలిసి, శాలువ కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సత్కరించారు. వారి వెంట ఏఎంసీ వైస్ చైర్మన్ కొట్టు గోవర్ధన్, గోపాల్‌యాదవ్ తదితరులున్నారు.

ఘనంగా రంగోళి, గాలిపటాల పోటీలు



బహుమతులు అందజేస్తున్న వనిత క్లబ్ ప్రతినిధులు

సూళ్లూరుపేట: సంక్రాంతి పండుగ సందర్భంగా వాసవీ వనితా క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక సాయిబాబా మందిరం ప్రాంగణంలో మంగళవారం మహిళలకు ముగ్గులపోటీలు, చిన్నారులకు గాలిపటాల పోటీలు ఘనంగా నిర్వహించారు. రంగోళి కార్యక్రమంలో మహిళలు పాల్గొని, రంగవల్లులు తీర్చిద్దారు. అలాగే చిన్నారుల కూడా గాలిపటాలను ఎగురవేసి సంక్రాంతి సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా అయితా సుభాషిణి, మురిగిపూడి పద్మజ వ్యవహరించి, విజేతలను ఎంపిక చేశారు. ఈ పోటీల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విజేతలకు బహుమతులు అందజేశారు. అలాగే పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రోత్సాహక బహుమతులను వాసవీక్లబ్ ప్రతినిధి బండారు శబరీష్ చేతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వనితక్లబ్ అధ్యక్షురాలు సునీత, కార్యదర్శి కళావతి, కోశాధికారి శైలజ, సాయిబాబా ఆలయ ప్రతినిధి బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ విజేత వెంగమాంబపురం జట్టు



బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

వెంకటగిరిరూరల్(బాలాయపల్లి): సంక్రాంతి సంబరాల్లో భాగంగా నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ పోటీల విజేతగా వెంగమాంబపురం జట్టు నిలిచింది. బాలాయపల్లె మండలం వెంగమాంబపురం గ్రామంలో నిర్వహించిన ఈ పోటీల్లో ఫైనల్ మ్యాచ్ మంగళవారం హోరాహోరీగా సాగింది. ఈ నెల 13వ తేదీన ప్రారంభమైన క్రికెట్ పోటీలకు వెంగమాంబపురం చుట్టు పక్కల గ్రామాలైన యాచవరం, కయ్యూరు, అక్కసముద్రం, అరిగేపల్లె, డక్కిలి మండలం నుంచి మాటుమడుగు, శ్రీపురం, నడింపల్లె, ఉప్పరపల్లె గ్రామాల నుంచి సుమారు 15 జట్లు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో వెంగమాంబపురం, మాటుమడుగు జట్లు ఫైనల్స్‌కు చేరుకోగా మాటుమడుగు జట్టుపై వెంగమాంబపురం జట్టు 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. దీంతో మాటుమడుగు జట్టు రన్నర్‌గా నిలిచింది. ఈమేరకు ఈ పోటీల్లో గెలుపొందిన జట్లకు ప్రథమ బహుమతిగా రూ.7,116, ద్వితీయ బహుమతి రూ. 3,516 దక్కించుకున్నాయి.

ముగిసిన సంక్రాంతి క్రికెట్ పోటీలు

చిల్లకూరు: తీర ప్రాంతంలోని ఏరూరులో ఉన్న శివ గణేష్ క్రీడా మైదానంలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న సంక్రాంతి క్రికెట్ పోటీలు మంగళవారంతో ముగిశాయి. గ్రామానికి చెందిన రామసీత వెల్ఫేర్ ఫౌండేషన్ నిర్వాహకులు కే.శే. చెంచురామయ్య జ్ఞాపకార్థం ఈ క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో సుమారు 9 జట్లు తలపడ్డాయి. ఫైనల్స్‌లో పాత దళితవాడ, బలిజపాళెం జట్లు తలపడ్డాయి. పాత దళితవాడ జట్టు విజయం సాధించింది. ఆ జట్టుకు మొదటి బహుమతిగా రూ.15,016ను చిల్లకూరు పీఏసీఎస్ అధ్యక్షుడు చేవూరు నాగరాజు చేతుల మీదుగా అందజేశారు. రెండో స్థానంలో నిలిచిన బలిజపాళెం జట్టుకు రూ 7,500 ద్వితీయ, అల్లీపురం జట్టుకు రూ. 4వేల నగదు తృతీయ బహుమతిగా అందజేశారు.

సమన్వయంతోనే అభివృద్ధి



మాట్లాడుతున్న ఎంపీపీ అల్లూరు అనిల్‌కుమార్‌రెడ్డి

సూళ్లూరుపేట రూరల్ : అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తే మండలాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లవచ్చని ఎంపీపీ అల్లూరు అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని పంచాయతీల వారీగా జరుగుతున్న అభివృద్ధి పనులపై ఆయన అధికారులతో సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని పంచాయతీల్లో సిమెంటురోడ్లు వేస్తున్నామని తెలిపారు. రైతులకు సేవలను అందించే రైతు భరోసా కేంద్రాలు మంచి సేవలను అందిస్తున్నాయని, వాటిని మరింత బలోపేతం చేసి, మరిన్ని మెరుగైన సేవలను అందించేలా చూడాలని కోరారు. రాబోయే రెండేళ్లలో మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అభివృద్ధిపై మరింత దృష్టి పెట్టనున్నారని చెప్పారు. ఈ క్రమంలో మండలంలో ఏ పంచాయతీలో ఎలాంటి పనులు చేస్తే బాగుంటుందో ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ఆలోచించి ప్రణాళికలు రూపొందించుకోవాలని చెప్పారు. రాబోయే వేసవి కాలానికి తాగునీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు ఇప్పటి నుంచి తగిన ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సంక్షేమ పథకాలు, అభివృద్ధి రెండింటిని సమానంగా చేస్తుందని తెలిపారు. ఎంపీడీఓ ప్రమీలారాణి, జెడ్పీటీసీ సభ్యులు ఉగ్గమూడి సుప్రియ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

వైభవం.. గ్రామోత్సవం







కోట: విశేషాలంకరణలో శ్రీమహాలక్ష్మి, ఓజిలి: విశేషాలంకరణలో చింతాలమ్మ, గూడూరు: తాళమ్మ

కోట: మండలకేంద్రంలో శ్రీమహాలక్ష్మి అమ్మవారి గ్రామోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని మహిళలు, భక్తులు అమ్మవారికి కర్పూర నీరాజనాలిచ్చి, మొక్కులు చెల్లించుకున్నారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా చింతాలమ్మ...

ఓజిలి: మండలంలోని గుర్రంకొండ గ్రామంలో గ్రామదేవత చింతాలమ్మవారి గ్రామోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. మేళతాళాలు బాణసంచా పేలుళ్ల నడుమ యువత కేరింతలతో అమ్మవారిని ఊరేగించారు. మహిళలు అమ్మవారికి పొంగళ్లు పెట్టారు. రాత్రి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. గ్రామస్తులు అమ్మవారిని దర్శించుకుని నైవేద్యం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ముప్పాళ్ల మాధవీలత, వైఎస్సార్‌సీపీ నాయకులు వామనరాజు, సురేష్‌రాజు, మోహన్‌రాజు, ప్రదీప్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా గొబ్బెమ్మ ఊరేగింపు



సైదాపురం: ప్రత్యేకఅలంకరణలో గొబ్బెమ్మ

సైదాపురం: మండలంలోని సైదాపురం, కమ్మవారిపల్లె, గిద్దలూరు, కలిచేడు, తురిమెర్ల గ్రామాల్లోని ఎస్టీ కాలనీలో మంగళవారం గొబ్బెమ్మ ఊరేగింపు వేడుకగా జరిపారు. ఈ సందర్భంగా అమ్మవారికి విశేషాలంకరణ, ప్రత్యేక పూజలు చేసి, మొక్కులను తీర్చుకున్నారు. అనంతరం అమ్మవారిని పురవీధుల్లో తప్పెట్లు, తాళాలు, విచిత్ర వేషధారణలు, నృత్యాల నడుమ ఊరేగించారు.

ప్రత్యేకాలంకరణలో తాళమ్మ తల్లి

గూడూరు: గ్రామ దేవత తాళమ్మ తల్లి మంగళవారం విశేషాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పట్టణ సమీపంలో ఉన్న తాళమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో అక్కడికి చేరుకుని, మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి, ప్రసాదాలు స్వీకరించారు.

కోడిపందేల స్థావరంపై దాడులు



వెంకటగిరి: పోలీసుల అదుపులో కోడిపందెం రాయుళ్లు



వాకాడు: పట్టుపడిన కోడి పందేలరాయుళ్లు

వెంకటగిరిరూరల్: మండలంలోని యాతలూరు అటవీ ప్రాంతంలో కోడి పందేల స్థావరంపై వెంకటగిరి ఎస్ఐ జిలానీ ఆధ్వర్యంలో సిబ్బంది మంగళవారం దాడులు చేశారు. రహస్య సమాచారం మేరకు జరిగిన ఈ దాడుల్లో నలుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి మూడు సెల్‌ఫోన్లు, రూ.9300 నగదు, రెండు కోడిపుంజులు, మూడు మోటారుసైకిళ్లు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు.

వాకాడు మండలంలో..

వాకాడు: మండలంలో పలు చోట్ల నిర్వహిస్తున్న కోడి పందేల స్థావరాలపై మంగళవారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో వాలమేడు వద్ద కోడి పందేలు నిర్వహిస్తున్న వారిపై ఎస్ఈబీ సీఐ ప్రసన్నలక్ష్మి, ఎస్ఐ రఘునాథ్ దాడులు చేసి, రెండు బైక్‌లు, 5 సెల్‌ఫోన్లు, 10 కోళ్లు, రూ.6380 నగదు స్వాధీనం చేసుకుని, 10 మంది నిర్వాహకులను అరెస్టు చేశారు. పట్టుపడిన వారిపై వాకాడు ఎస్ఐ రఘునాథ్ కేసు నమోదు చేశారు.

సారా తయారీ స్థావరంపై ..

డక్కిలి: మండలంలోని వెలికల్లు దళితవాడలో సారా తయారీ చేస్తున్నట్లు వచ్చిన సమాచారంతో వెంకటగిరి ఎస్ఈబీ అధికారులు మంగళవారం దాడులు చేశారు. ఎస్ఈబీ సీఐ నాగేశ్వరరావు కథనం మేరకు.. వెలికల్లు దళితవాడకు చెందిన చింతగుంట శివశంకర్ అలియాస్ శివ అనే వ్యక్తి గ్రామానికి సమీపంలో సారా తయారీకి 100 లీటర్ల బెల్లం ఊటను తయారు చేస్తుండగా పట్టుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచి రిమాండ్‌కు తరలిచించినట్లు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ జే మునిశేఖర్, కానిస్టేబుళ్లు బీ పుట్టయ్య, ఎస్‌కే రఫీ, ఎం పుల్లయ్య, ఏ రవికుమార్ పాల్గొన్నారు.

రేపటి నుంచి ప్రజాభిప్రాయ సేకరణ

నాయుడుపేటటౌన్: స్థానిక విద్యుత్‌శాఖ ఈఈ కార్యాలయం వద్ద గురువారం నుంచి మూడు రోజులు విద్యుత్ చార్జీల సవరణపై ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతుందని ఏపీఎస్‌పీడీసీఎల్ ఈఈ కృష్ణప్రసాద్ తెలిపారు. మంగళవారం ఈఈ విలేకరులతో మాట్లాడారు. విద్యుత్ చార్జీల సవరణపై నాయుడుపేట, సూళ్లూరుపేట, విద్యుత్ సబ్ డివిజన్ల పరిధిలో ఈ నెల 19, 20, 21 తేదీల్లో ప్రజాభి ప్రాయ సేకరణ జరుగుతుందన్నారు.

వెంకటగిరిలో..

వెంకటగిరి: విద్యుత్ చార్జీల సవరణపై ప్రజాభిప్రాయ సేకరణకు వీడియో కాన్ఫరెన్స్‌ను ఈ నెల 19, 20, 21 తేదీలో నిర్వహించనున్నట్లు ట్రాన్స్‌కో డీఈఈ మునిరవిచంద్ర మంగళవారం తెలిపారు. నెల్లూరు ఎస్ఈ కార్యాలయం, లేదా నాయుడుపేట ఈఈ కార్యాలయంలో మూడురోజుల జరుగుతుందన్నారు.

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
మేనకూరు శాఖ - నాయుడుపేట (మం), తిరుపతి జిల్లా

బంగారు నగల వేలం ప్రకటన

ఈ క్రింద పేర్కొన్న వ్యక్తి మా బ్యాంక్‌నందు బంగారు నగలు తాకట్టు పెట్టి గడువు సమయములో విడిపించుకోలేకపోయినందున బ్యాంక్ నిబంధనల మేరకు తేది 25-1-2023 బుధవారం సాయంత్రం 4.00 గం॥లకు మా శాఖ ఆవరణం నందు వేలం నిర్వహించబడును.

వ నెం	అకౌంట్ నెంబరు	ఖాతాదారుని పేరు మరియు చిరునామా	గ్రాస్ వెయిట్
1	38716046611	సట్టు వెంకట నారాయణ రెడ్డి S/o లక్ష్మణరెడ్డి, కొత్తచెరువు, ఓజిలి (మం)	40.00

గమనిక: వేలము వాయిదా లేక రద్దు చేయుటకు బ్యాంక్ వారికి సర్వహక్కులు కలవు
తేది 17-01-2023 సం/- బ్రాంచ్ మేనేజర్, మేనకూరు శాఖ, సెల్: 9494286951